28న డాక్టర్ శ్రీను నాయక్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : రవాణా కాదు కదా..... కనీస సౌకర్యాలు కూడా లేని గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరు గ్రామశివారు దావులూరి తండాలో జన్మించిన అతి సామాన్య వ్యక్తి భూక్యా శ్రీను నాయక్.... స్వయం శక్తితో అంచలంచెలుగా ఎదుగుతూ అనన్య సామాన్యంగా... అదీ ప్రజావైద్యునిగా ఉన్నతికెక్కారు. అలాంటి మహోన్నత వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో లక్షల మందికి సేవలందిస్తూ 2022 నవంబర్ 9న తుదిశ్వాస విడిచారు. డాక్టర్ నాయక్ కాంస్య విగ్రహాన్ని ఈ నెల 28న ఆవిష్కరిస్తున్నట్లు ఆయన సతీమణి డాక్టర్ జాస్తి మాధవి, కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనను జీవితాంతం కంఠస్థం చేసేందుకు ఆయన చేసిన మంచి పనులను స్మరించుకుంటూ ఆయన సతీమణి స్వగ్రామంలో మహల్ నిర్మించి, ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ నెల 28 సాయంత్రం 7 గంటలకు గుంటూరు జిల్లా తూములూరు పంచాయితీ దావులూరి తండాలో పాలరాతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారు.

వరి రైతుకు నష్టం లేదు

విశాలాంధ్ర-పొన్నూరు : వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వరి సాగు రైతులకు అకాల వర్షపాతం వలన ఎటువంటి నష్టం లేదని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండల పరిధిలో అక్కడక్కడ వరి పంట నేలవాలయని రైతులు పైకి కట్టలుగా కట్టి సంరక్షించుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగానే ఉందని ప్రభుత్వ మద్దతు ధరతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

సమాజంలో అందరూ సమానమే : ఎంపీపీ

విశాలాంధ్ర-పొన్నూరు: భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ప్రతి ఒక్కరూ సమాన హక్కులు కలిగి ఉండాలని, వివక్షకు లోను కాకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. శనివారం ఎండిఓ కార్యాలయం వద్ద జరిగిన జండర్ అధారిత జాతీయ కార్యక్రమంలో మాట్లాడారు. వివక్ష, గృహహింస వ్యతిరేక కార్యక్రమంపై ఏపిఎం గోపి వివరించారు. శ్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు, మహిళ సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని 26వ వార్డు ఇటీకంపాడు రోడ్డు ప్రధాన రహదారి ప్రక్కన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తీగలు నేలపై పడి ప్రమాద భరితంగా ఉన్నాయి. గతంలో ట్రాన్స్ఫార్మర్ దగ్గర తీగలు కాలిపోయి మంటలు చెలరేగి పాదాచారులకు ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు ఫెనిషింగ్ వేస్తామని చెప్పి సంవత్సరాలు గడుస్తున్న వేయలేదు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

జెండర్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం డ్వాక్రా మహిళలకు జెండర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. మనుషుల మధ్య లింగ వివక్ష తగదని, స్త్రీ, పురుషులు సమానమేనని అందరూ బాగుంటేనే సమాజం బాగుంటుందని డీఆర్‌డీఏ పీడీ వై.హరహరనాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, ఏపీఎం ఆర్.సాంబశివరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారీ వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా రహదారి భద్రత నిబంధనలు పాటించాలని ఆర్టీఓ ఇన్‌ఛార్జ్ ఎం.గోపాల్ అన్నారు. ఈ మేరకు శనివారం గుంటూరు నగరంలోని శ్రీ సాయి మారుతి హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న హెవీ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వాహన తనిఖీ ఇన్స్పెక్టర్లు మల్లీశ్వరి, సౌజన్య శిక్షణ ముగించుకున్న డ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలు గురించి వివరించారు. అనంతరం ఆర్టీఓ గోపాల్ మాట్లాడుతూ హెవీ వాహనాల డ్రైవర్లు చాలా అప్రమత్తంగా వాహనాలను నడపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవేయాల్సిన బాధ్యత బస్సు డ్రైవర్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'ఉచిత పాస్‌పోర్ట్ మేళా'పై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని లియో ఫార్మసీ సహకారంతో 200 మంది ఫార్మసీ విద్యార్థులకు ఉచిత పాస్‌పోర్ట్ మేళా, విదేశీ విద్యపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. ఈ నెల 23వ తేదీన ప్రారంభమైన ఈ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, బయో టెక్నాలజీ విభాగం వారు క్విజ్ పోటీలు, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం వారు జొన్నలగడ్డ గ్రామంలో బ్లడ్ షుగర్, బీపీ పరీక్షలు చేసి వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 27న బహుమతి ప్రదానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సామాజిక సేవ దృక్పథంతో సమా జంలో బడుగు బలహీన వర్గాలని, ఆపదలో ఉన్న వారిని అనాధలను ఆదు కోవాలనే ఉద్దేశంతో త్వరలో ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్న నేపథ్యంలో భాగంగా శనివారం గుంటూరు నగరానికి చెందిన షేక్ సుభాని స్థానిక అమ్మ ఆశ్రమంలో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో తనకి వచ్చే ఆదాయంలో కొంత పేద ప్రజలకి ఖర్చు చేస్తానని, ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమలు చేస్తానని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో సమాజంలో అనేకమంది వృద్ధులకు అనాధలను ఆదుకొని వారికి ఒక చేయూతను అందించాలనే దృఢ సంకల్పంతో, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలియజేశారు.

క్రిస్మస్ నెల ప్రారంభం

విశాలాంధ్ర-తాడికొండ : క్రిస్మస్ నెల ప్రారంభమైంది. క్రీస్తు జన్మదినం పురస్కరించుకొని డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో క్రిస్మస్ పండుగకు శుభసూచకంగా నెల రోజులు ముందుగానే స్టార్స్‌ను ఏర్పాటు చేయటం ఆనవాయితీ. తాడికొండ తెలుగు బాప్టిస్ట్ చర్చి బడేపురం లూథరన్ చర్చి ఆధ్వర్యంలో స్టార్స్‌ను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ 2024కు స్వాగతం పలుకుతూ స్టార్స్ వెలిశాయి.

కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఘటిద్దాం: వెలుగూరి

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీలలో దేశంలోని అన్ని రాష్ట్రాలల్లోని గవర్నర్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా విజయవాడ నగరంలో ఉన్న జింఖానా గ్రౌండ్స్‌లో రెండు రోజుల పాటు మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్మికులు, కర్షకులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలుగూరి మాట్లాడారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు తాను చేసింది ఏమీ లేదని వారు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన లేబర్ కోడ్‌లను తీసుకువస్తూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు కేవలం కార్మికులు, రైతాంగానికి సంబంధిం చినవి మాత్రమే కాదని యావత్ భారతదేశ ప్రజానీక పోరాటమని అన్నారు. ప్రజలు కూడా భాగస్వామ్యం అవ్వాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని, గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని, స్వామినాథన్ కమీషన్ సూచ నలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున కార్మికులు, కర్షకులు పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

5న అగ్రిగోల్డ్ సత్యాగ్రహ దీక్ష జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మన ప్రభుత్వం గెలిస్తే అగ్రిగోల్డ్ బాధితులు అందరికీ పూర్తిగా డబ్బులు చెల్లిస్తానని చెప్పినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీరా అధికారం వచ్చినాక మాట తప్పి మడమ తిప్పారని అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం అసోసియేషన్ సమావేశం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి పేర్ల కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న అసోసియేషన్ మంగళగిరి నియోజకవర్గ గౌరవాధ్యక్షులు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, కేతినేని అగస్టీన్‌లు మాట్లాడుతూ జగన్ మోసపూరిత వాగ్దానాలతో అందరినీ మోసం చేస్తూ అగ్రిగోల్డ్ బాధితులను కూడా మోసం చేస్తూ వచ్చారని మండిపడ్డారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి సీపీఐ అండదండలతో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని అనేక శాంతియుత పోరాటాలు జరిపి మరణించిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున 142 మంది బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించారన్నారు. రూ.20 వేల లోపు వారికి రూ.906 కోట్లు, రూ.10 లక్షల లోపు బాధితులకు రెండు విడతలగా ఇప్పించడం, బాధితుల బాండ్లను నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న జగన్ దీక్ష శిబిరానికి వచ్చి వారం రోజుల్లో రూ.1182 కోట్లలను, ఆరు నెలల్లో మిగిలిన వారందరికీ వడ్డీతో సహా ఇస్తానని కోర్టు సంగతి యాజమాన్యం సంగతి నేను చూసుకుంటానని చెప్పారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కె.రామకృష్ణ అగ్రిగోల్డ్ బాధితుల కార్యక్రమాలలో పార్టీ క్యాడర్ కూడా పాల్గొనమని చెప్పినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. డిసెంబర్ 4నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రంలో రోజుకొక నియోజకవర్గంలో సత్యాగ్రహ దీక్షలు, 15వ తేదీన మరణించిన బాధిత కుటుంబ సభ్యులతో విజయవాడలో నిరాహార దీక్ష, 18న కలెక్టర్ కార్యాలయాల వద్ద ర్యాలీ, నిరసనలు, వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమం జరుగుతాయని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో మంగళగిరి అంబేద్కర్ బొమ్మ సెంటర్ వద్ద డిసెంబర్ 5న అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ దీక్షలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు చక్రధర్ బాబు, తాడేపల్లి మండల అధ్యక్షులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మన రాజ్యాంగం మహోన్నతం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రపంచ దేశాలలోని రాజ్యాంగాలలో మన దేశ రాజ్యాంగం మహోన్నతమైనదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఘంటా రామారావు అన్నారు. విజ్ఞాన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నేషనల్ లా డేను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఘంటా రామారావు మాట్లాడుతూ విద్యార్థులు న్యాయశాస్త్రాన్ని అభ్యసించి సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం దక్కేలా కృషి చేయాలన్నారు. న్యాయశాస్త్రాన్ని అభ్యసించే విద్యార్థులు ప్రతి రోజు కొత్త విషయాలను, సరికొత్త టెక్నాలజీలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. భారతపౌరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కాపాడుటకు రాజ్యాంగంలో సమానత్వపు హక్కు వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్రపు హక్కు, దోపిడీను నిరోధించే హక్కు, మత స్వాతంత్ర్యపు హక్కు, విద్య, సాంస్కృతిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరచి వీటి పరిరక్షణ బాధ్యతలను న్యాయస్థానాలకు అప్పగించిందన్నారు. ఢిల్లీలోని యూనివర్సిటీ ఆఫ్ లా ఫ్యాకల్టీ డాక్టర్ పరిక్షిత్ సిరోహి మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యసించే విద్యా ర్థులు ప్రతిరోజు సమాజంలో ఎటువంటి సంఘటనలు, పరిణామాలు సంభవిస్తున్నాయో గమనిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం డిజిటలైజేషన్, సైబర్ నేరాలు పెరుగుతున్నందు వలన న్యాయశాస్త్రం చదివే విద్యార్థులు ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి కొత్త టెక్నాలజీలపై పట్టు సాధించాలని సూచించారు. నేషనల్ లా డేను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో సత్తాచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, మెమొంటోలను అందజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ నెట్‌వర్క్ హాస్పిటళ్లలో ప్రభు త్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ) గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్‌ను కోరారు. శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని రకాల జబ్బులకు నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. అలాగే జీజీహెచ్ నందు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద ఏర్పాటు చేసిన వార్డు నందు ప్రతిరోజూ డాక్టర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జీజీహెచ్ నందు ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రతి మూడు నెలలకొకసారి ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సంఘాల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన జిల్లా సమన్వయకర్త డాక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్ అన్ని విషయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి కోటా సాహెబ్, నగరశాఖ ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులు దక్షిణామూర్తి, భరత్ కుమార్, లక్ష్మీనారాయణ, నాగభూషణం, జిల్లా పెన్షనర్ల సంఘం కార్యదర్శి మత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి హనుమంతరావు, ఉపాధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నుంచి ఎస్టీయూలో చేరిన ప్రసాదరావు



విశాలాంధ్ర-ఫిరంగిపురం: యూటీ ఎఫ్ జిల్లా కమిటీలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు బండ్ల ప్రసాద రావు మండల ఎస్టీయూ యూనియ న్‌లో సభ్యులుగా చేరినట్లు ఎస్టీయు సంఘం జిల్లా అధ్యక్షులు పెదబాబు చెప్పారు. ప్రసాదరావు మండలంలోని రేగులగడ్డ ఎంపిపియుపి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారన్నారు. సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి జరిగిన మండల కార్యవర్గ సమా వేశం అనంతరం ఎస్టీయు యూనియన్ జిల్లా అధ్యక్షులు పెదబాబు, జిల్లా ఉపాధ్యాక్షులు గుండిగ జోజిప్ప, మండల ఎస్టీయు అధ్యక్షులు టి.భాస్కర్, ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రసాదు, మరియు మండల కార్యవర్గ సభ్యుల సమక్షంలో ప్రసాదరావు ఎస్టీయు యూనియన్‌లో చేరారని పెదబాబు తెలిపారు. అనంతరం మండల ఎస్టీయు యూనియన్ నాయకులు, సభ్యులు కలిసి జిల్లా నాయకులు పెదబాబును సన్మానించారు.

రేపు జానపద కళా సదస్సు

విశాలాంధ్ర, తెనాలి : అభ్యుదయ కళా సమితి తెనాలి ఆధ్వర్యంలో ప్రముఖ అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ జయంతి, ప్రముఖ సినీ దర్శకుడు వీరమాచనేని (విక్టరీ) మధుసూదనరావు శత జయంతి సందర్భంగా తెనాలి గాంధీనగర్‌లో బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ హాలులో జానపద కళా రూపాల సదస్సు మధ్యాహ్నం 3 గంటల నుండి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జానపద కళలు బుర్రకథ, ఒగ్గు కథ, కోలాటం, చెక్క భజన, తప్పెటగుళ్ళు తదితర కళల కళాకారులు సదస్సులో పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర, జిల్లా జానపద కళాకారులలో ప్రముఖులు పాల్గొని సందేశాలు ఇస్తారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమ నిర్వహణలో గోలి సీతారామయ్య, ప్రొఫెసర్ బి.లలితానంద ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి జానపద కళా కారులు, సాహిత్య అభిమానులు, ఇతర కళాకారులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా పేర్కొన్నారు. గాయకులు జగన్మోహనరావు అమెరికాలో సంగీత విభావరిలో పాల్గొనేం దుకు వెళుతున్న సందర్భంగా అభినందన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

నగరంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

విశాలాంధ్ర-మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శనివారం విస్తృతంగా పర్యటించారు. తొలుత కార్పొరేషన్ పరిధి చినకాకానిలోని డాక్టర్ వైయస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఎన్ కాస్ గుర్తింపు నిమిత్తం హెల్త్ సెంటర్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చినకాకానిలోని నేతన్న సర్కిల్‌ను పరిశీలించారు. కొప్పరావు కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పరిశీలన, ఎర్రబాలెం శ్రీనగర్ కాలనీలో సిసి రోడ్లు పరిశీలన, మంగళగిరి పెద్ద కోనేరు అభివృద్ధి పనులు పరిశీలన, పాత బస్టాండ్ ఆవరణలో తుది దశకు చేరుకున్న చేనేత బజారు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, నగరపాలక సంస్థ డిఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పర్యావరణం పట్ల సాధారణ ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని పర్యావరణ ఉద్యమ ప్రచారకులు టి.నార పరెడ్డి అన్నారు. స్థానిక అవగా హన సంస్థ కార్యాలయంలో 'పర్యావరణం విషతుల్యంగా మారుతున్న పరిస్థితులు-ప్రజల, ప్రభుత్వాల మధ్య'అనే అంశంపై చర్చ శనివారం జరిగింది. ఈ సందర్భంగా నారపరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలుష్య నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణ యోగ్యంకాని విధానాలతో..ప్రయోగాలతో సమస్యను రోజురోజుకీ జటిలం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరో పర్యావరణ ఉద్యమనేత ఆర్.వెంకటరత్నం మాట్లాడుతూ ఢిల్లీలోనే కాదు దేశంలోని అనేక నగరాల్లో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటుందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణ యోగ్యమైన విధానాలను ప్రకటించటమే కాకుండా అమలుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలన్నారు. ఈ చర్చలో కొండా శివరామిరెడ్డి, ఇందుశేఖర్, రవిబాబు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా కార్యాచరణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా బిఎల్ఓలు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పలు విద్యా సంస్థల్లో ఏఈఆర్ఓలు, బిఎల్ఓలు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం) కార్యక్రమం చేపట్టారు. ఇంకా ఎవరైనా 18 ఏళ్లు నిండి ఓటు లేకుంటే వారికి కూడా ఓటు కల్పించేలా స్వీప్ కార్యక్రమం ద్వారా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓలు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సూపర్వైజరి అధికార్లు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర, తెనాలి : స్థానిక చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల నందు శనివారం కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో దానిపై వున్న అపోహలను విడనాడాలని తెలిపారు. చర్మంపై రాగి వర్ణం గల స్పర్శ లేని మచ్చలు వున్నట్లయితే వెంటనే దగ్గరలోని వైద్య సిబ్బందికి తెలియజేయాలని, ప్రభుత్వం వారు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలియజేశారు. యుయల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి మాట్లాడుతూ, కుష్ఠ వ్యాధికి బహుళ ఔషధ చికిత్స ద్వారా ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి, క్రీడా ఉపాధ్యాయుడు జె.రమేష్, ఉపాధ్యాయులు వెలగ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫార్మా వారోత్సవాలు ముగింపు

విశాలాంధ్ర, తెనాలి : ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, ముంబై, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరమ్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వారి ఆధ్వర్యంలో నవంబరు 19వ తేదీ నుండి ప్రారంభమైన 62వ జాతీయ ఫార్మా వారోత్సవాలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్శిటీ యస్‌యస్‌యస్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ వారోత్సవాలలో అనేక రకాలైన ఈవెంట్స్ జరగడం గొప్ప విషయమని, ఇలా విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మేనేజ్‌మెంట్‌ని, ప్రిన్సిపాల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈవెంట్స్‌లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు, ఏయస్ఎన్ ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ అన్నాబత్తుని శివకుమార్ ఘనత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వై ఫణి కృష్ణ, కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జ్యోతిబసు, సునీల్ కుమార్, షాలేం రాజు ట్రేసర్, వెంకట్ ప్రసాద్, సుష్మ, గీత, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్ప రాజు వెంకటేశ్వర్లు నాయకత్వంలో డిసెంబర్ 10వ తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్స్ లో జరిగే రాష్ట్రవ్యాప్త ఔట్ సోర్సింగ్ కార్మికుల మహాసభను జయప్రదం చేయాలని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజనీరింగ్-టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం నగరపాలక సంస్థ స్ట్రీట్ లైటింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులతో సమావేశమై వారిని ఈ మహాసభకు హాజరు కావాల్సిందిగా సన్నద్ధం చేశారు. నేను వెళ్తున్నాను-నువ్వు వస్తున్నావా అనే నినాదంతో కార్మికుల ముందుకు వెళ్లారు. మధుబాబు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అప్పటివరకు కనీస వేతనం అమలు చేయాలని, సంవత్సరానికి ఒక ఇంక్రిమెంటు ఇవ్వాలని, కార్మికులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ మహాసభలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నాగిపోగు సుమన్, ఏసుబాబు, యాకోబు, పైడిమర్రి విలియం, జెల్లీ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఘనంగా దీక్షారంబ్

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి) లో నూతన విద్యార్థులకు స్వాగతం పలికే దీక్షా రంబ్ 2023-24 కార్యక్రమం ఉత్సాహంగా, స్ఫూర్తివంతంగా నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యావేత్త, కమ్యూనిటీ బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నరేష్ చిగురుపాటి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో అన్ని రంగాలలో తొలి అడుగులు మహిళలవేనన్నారు. సుప్రీంకోర్టు న్యాయ వాది మన్నవ ఆర్‌కేఎం షోడేకర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు దూరంగా... తమ ముందు ఉన్న బాధ్యతలను గుర్తు ఎరిగి రాణించాలని చెప్పారు. ఏడవ అడిషనల్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.జోత్స్న మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల తనలాంటి వేలాది మంది జీవితాలలో వెలుగులు నింపిందని అన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్ జోత్స్నకుమారి అధ్యక్షత వహించగా స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ కె.సుబ్బరత్నం, ప్రెసిడెంట్ కె.ప్రియశ్రీ, డాక్టర్ పి.విజయలక్ష్మి, డి.ఉమా, టి.ప్రణయజ, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ షమా సుల్తానాకు 'నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నిత్యం ప్రజలకు అందుబా టులో ఉంటూ అతి తక్కువ ధరకే వైద్య సేవలు అందిస్తున్న హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, ఫౌండర్ ఆఫ్ యువనారి హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆఫ్ పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ ఐఎంఎ డాక్టర్ షమా సుల్తానాకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు 'నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు' దక్కింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వార్షికోత్సవ అవార్డుల (2023)లో భాగంగా ఈ అవార్డును ఐఎంఎ జాతీయ ప్రెసిడెంట్ డాక్టర్ శారద్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ జి.రవికృష్ణల చేతులు మీదుగా డాక్టర్ షమా సుల్తానా అందుకున్నారు. గుంటూరులో ప్రజా చైతన్య కార్యక్రమాలలో వ్యక్తిగత ప్రతిభ చూపినందుకు ఐఎంఎ వారు డాక్టర్ షమా సుల్తానాకు ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు తీసుకున్న సందర్భంగా విజయవాడలోని డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమి వారు డాక్టర్ షమా సుల్తానాను ఘనంగా సత్కరించారు.

డాక్టర్స్ ఒలంపియాడ్‌లో రన్నర్‌గా డాక్టర్ వై.షేక్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 24న విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వారు నేషనల్ డాక్టర్స్ ఒలంపియాడ్-2023 టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. అయితే నేషనల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.షేక్ డబుల్స్ టెన్నిస్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరచి రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. శనివారం స్థానిక ఎత్తు రోడ్డు సెంటర్‌లో ఉన్న ఆయన గృహంలో మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు నిర్వహించిన నేషనల్ డాక్టర్స్ ఒలంపియాడ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రన్నర్‌గా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆటలు ఆడటం వలన స్కిల్స్ పెంపొంది అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో..కాలేజీల్లో ఆటలకు ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. శారీరక దృఢత్వాన్ని పొందటమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉండగలరని అన్నారు.

వాలీబాల్ పోటీల్లో జెఎంజే కళాశాల ప్రథమ స్థానం

విశాలాంధ్ర, తెనాలి : స్థానిక జె.యం.జె. కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న మహిళా వాలీ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. మొదటి స్థానంలో నిలిచిన జె.యం.జె. కళాశాల జట్టు ట్రోఫీని కైవసం చేసుకోగా, రెండవ స్థానాన్ని డి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒంగోలు వారు కైవసం చేసుకున్నారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వారు మూడవ స్థానాన్ని సాధించుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంటూరు వారు నాలుగో స్థానాన్ని పొందారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జె.యం.జె కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరెసమ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ శారద, పలు కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. జె.యం.జె కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ సుజాత ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన తాళ్ళూరి అరుణ, తాళ్ళూరి లేటు లక్ష్మీనారాయణ గారి భార్య,ఇన్నర్ రింగు రోడ్డు లోని సాయినాథ కాలనీలోని Sai Shraddha Enclave, Flat No.503, D.No.13-18-4099, గుంటూరు, గుంటూరుజిల్లా, అధార్ నెం.9114 3142 4438, సెల్.నెం.7702498497 కాపుర స్తులు తాళ్ళూరి అరుణ గారి ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారము తెలియజేయునది ఏమనగా ది.20-11-2023న గుంటూరు సిటీ, వేంకటేశ్వర స్వామి గుడి సెంటర్, గోరంట్లలోని జిరాక్స్ షాపుకు వెళ్ళి నాక్లయింట్ తన భర్త కొనుగోలుచేసిన ఫ్లాట్ తాలూకు Sale Deed No. 8611/2013 dt 12-08-2013) జిరాక్స్ తీయించుకొని వస్తూ వుండగా నాక్లయింట్ ఆటో ఎక్కినపుడు పై ఉదహరించిన దస్తావేజు ఒరిజినల్ జారీ పడిపోయి నది. నా క్లయింట్ ఆ విషయం చూసుకొనలేదు. ఇంటికి వచ్చిన తరువాత నా క్లయింట్ ఒరిజినల్ దస్తావేజు పోయినట్లుగా గ్రహించి, నా క్లయింట్ వెళ్ళి అక్కడ అందరినీ విచారించెను. సదరు సెంటర్‌లో సదరు దస్తా వేజులు దొరికినట్లుగా చెప్పలేదు. కావున సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికినచో నాకు గానీ లేక నాక్లయింట్‌కు గానీ పై తెలిపిన అడ్రసు నందు అందచేయ గల వారలు.అలా అందజేసిన వారికి తగిన పారితోష కము ఇవ్వబడును.

సిద్ధా సత్యనారాయణ, అడ్వకేటు & నోటరీ
డోర్.నెం.49-1-16, కన్యకాటవర్స్, శీలంవారి వీధి, కొత్తపేట, గుంటూరు. సెల్: 9441504506

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

అవినీతి అక్రమాలతో జగన్ పాలన

విశాలాంధ్ర-పెదకూరపాడు : అవినీతి, అక్రమాలతో పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని అత్తలూరులో బాబూ ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రతి ఒక్కరూ ఒక సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ షేక్.జాని పాల్గొన్నారు.

సబ్ జైలులో తనిఖీలు

విశాలాంధ్ర-గురజాల : సాధారణ తనిఖీలలో భాగంగా స్థానిక సబ్ జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.షర్మిల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో న్యాయమూర్తి భోజన సదుపాయాల గురించి..ఉచిత న్యాయ సహాయం గురించి.. వైద్యం తదితర అత్యవసర సర్వీసులను సరిగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ జానీబాషా, ఉచిత సహాయ న్యాయవాది ప్రభుదాస్, జైలు అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు సద్ది వితరణ

విశాలాంధ్ర-వినుకొండ: అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ సభ్యులకు వినుకొండ గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ రావు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వినుకొండ పాత శివాలయంలో స్వామి మాలలు ధరించిన స్వాములకు శనివారం అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సద్ది వితరణ కార్యక్రమం 18వ రోజుకు చేరుకుంది. 18వ రోజు సద్ది వితరణ గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవరావు ఏర్పాటు చేసారు. అనంతరం రాఘవరావు,రమణమ్మ దంపతులు, తమ కుటుంబ సభ్యులతో కలిసి సద్ది వితరణ చేశారు. ఇందులో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్‌కు ఆహ్వానించి సద్ది వితరణ చేయించారు. అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ సభ్యులకు రాఘవ రావు దంపతులను దుశ్శాలతో మెమొంటోతో సన్మానించి అభినందనలు తెలుపుతూ తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాఘవ సేవలను ఐయూబ్ ఖాన్ ప్రశంసించారు.

తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర-వినుకొండ: పల్నాడు జిల్లా ఎస్.ఈ.బి స్టేక్ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్(డి.సి.ఈ.ఓ) వారి ఆదేశాల మేరకు వినుకొండ ఎస్.ఈ.బి ఇన్స్పెక్టర్ మరియు వారి సిబ్బంది కలిసి నిర్వహించిన దాడిలో వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ 6 వ వీధిలో ద్విచక్ర వాహనం మీద మద్యం తరలిస్తున్న మహిళను నుంచి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 34 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనం కూడా సీజ్ చేశారు. ముద్దాయి అయిన దాసరి రేణుక మీద కేసు నమోదు చేసి వినుకొండ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారు.

10 నుంచి కులగణన

విశాలాంధ్ర-మాచర్ల: డిసెంబర్ 10నుండి పట్టణంలో కుల గణన కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఇ.వి రమణ బాబు కోరారు. శనివారం కమిషనర్ రమణబాబు విలేకరులతో మాట్లాడుతూ 318 క్లస్టర్ల పరిధిలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి 119 మంది సచివాలయ కార్యదర్శులు, 313 మంది వాలంటీర్లు, 4 మంది మున్సిపల్ సూపర్వైజర్ల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ప్రభుత్వ యాప్ లో గోప్యంగా ఉంచడం జరుగుతుందని, యాప్‌లో కనిపించే డేటాను స్క్రీన్ షాట్, జిరాక్స్ తీసేందుకు సాధ్యపడదు అన్నారు. కార్యక్రమంపై ప్రజలకు ఎలాంటి అపోహ అవసరం లేదన్నారు. వివరాల సేకరణ సమయంలో కుటుంబ సభ్యులలో ఒకరు ఫింగర్ ప్రింట్ వేయాల్సి ఉంటుందని, కావున ఎటువంటి అవకతవకలకు తావుండదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: విద్యార్థులు ఆరోగ్య విషయాలపట్ల జాగ్రత్తలు పాటించాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ అన్నారు. మండలంలోని మురికిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా సరైన చికిత్స అందించవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా 600 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. విద్యార్థులకు డెంటల్ హెల్త్ చెకప్ కార్డులను అందించారు. సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ శారదాంబ, డాక్టర్ వై మధులత, డాక్టర్ బొంతా శ్వేత. డాక్టర్ కందిమళ్ల వాసుదేవ అంకమ్మచౌదరి పాల్గొన్నారు.

ఓటర్లు అధైర్యపడొద్దు: ఆర్డీఓ

విశాలాంధ్ర-గురజాల : నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో సుమారు 2 వేల మంది ఓటర్ల వివరాలలో డబల్ ఎంట్రీ, ఫొటో మార్పు ఉందని గుర్తించామని, ఈ విషయంపై వివరణ కోరుతూ ఆ రెండు వేల మంది ఓటర్లకు నోటీసులు పంపించడం జరిగిందని ఆర్డీవో రమణ కాంత్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న నియోజకవర్గ ఓటర్లు ఎవరూ అధైర్యపడవద్దు అని, ఓటర్ల వివరణ లేనిదే ఏ ఒక్క ఓటు తీసి వేయడం జరగదని ఆర్డీవో తెలిపారు. ఆ నోటీసులకు నిర్ణీత గడువులోపు స్పందించి డబల్ ఎంట్రీ, ఫొటోల మార్పుపై పోస్ట్ లేదా ఈ మెయిల్ ద్వారా తగిన వివరణ ఇవ్వాలని నోటీసులలో పేర్కొన్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆ నోటీసుల గురించి వివరణ కోరుతూ సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో)సదరు ఓటర్లను సంప్రదిస్తారని, బీఎల్వోలు సంప్రదించిన తర్వాత వారు వచ్చే సమయంలో సదరు ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఆర్డీవో తెలిపారు. నోటీసులు ఇచ్చిన ఓటర్ల ఓట్లను తక్షణం తొలగించడం లేదని, ఆ రెండు వేల మంది ఓటర్లతో సంప్రదించి వారి వివరణ తీసుకున్న తర్వాతే ఓట్ల తొలగింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దానియేలు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు రాజ్యాంగం దిక్సూచి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రతి వ్యక్తి భారత రాజ్యాంగానికి లోబడి జీవించడం ద్వారా సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ తురకా మంగయ్య అన్నారు. శనివారం ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మానవ హక్కుల క్లబ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్ని తెలిసికొని, విధుల్ని గౌరవించినట్లయితే అంబేడ్కర్ కోరుకొన్న సమ సమాజం స్థాపించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ అరుణ్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు పెంచి ఇవ్వాలి: మారుతి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కళాకారులు పెన్షన్ దారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.2750 పెన్షన్‌ను రూ.6వేలకు పెంచి ఇవ్వాలని, వికలాంగులకు రూ.7వేలు ఇవ్వాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వినుకొండ పట్టణంలోని 30వ వార్డులో సీపీఐ, పెన్షన్ దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ నగర్‌లో పెన్షన్లు పెంచాలని జరిగిన సంత కాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన నేడు దేశంలో విపరీతంగా పెరిగిన అధిక ధరల భారం, పన్నుల భారం అనేక రకాల పెనుభారాలు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రభుత్వాలు ఇస్తున్న పెన్షన్‌దారులైన భార్యా భర్త జీవించుటకు ఏమాత్రం సరిపోవడం లేదని, వృద్ధాప్యంపై పడుతున్నందున అనారోగ్య కారణాలతో మందులు కొనలేకపోతున్నారని పెరిగిన ధరవరల ఫలితంగా వారి కుటుంబాలు గడవడం చాలా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. వృద్ధులు తీవ్ర అనారోగ్య బాధలతో అల్లాడిపోతున్న పెద్ద ఆసుపత్రులలో చూపించుకొనలేక డబ్బులు చాలక అవస్థలు పడుతున్నారని కావున 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఆరోగ్య జీవిత బీమా రాష్ట్ర ప్రభుత్వమే కల్పించి ఆ డబ్బు ప్రభుత్వమే కట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీపీఐ వినుకొండ నియోజకవర్గ కమిటీ ఈరోజు నిర్వహించిన ఈ సంతకాల సేకరణ పట్టణం మరియు పరిసర గ్రామాలన్నీ కూడా తిరిగి సంతకాలు సేకరిస్తారని వాటన్నిటినీ ప్రభుత్వానికి నివేదిస్తారని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేసి వృద్ధులు వికలాంగులకు ఇచ్చే పెన్షన్లు పెంచే విధంగా, మరియు వారికి ఆరోగ్య భీమా ఏర్పాటు చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఎ.పి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, సిపిఐ ఎంఎల్ నాయకులు సీతయ్య, భాస్కరు, సిపిఐ నాయకులు ఎ.పవన్ కుమార్, సోడాల సాంబయ్య, కే మల్లికార్జునరావు, ఎ.లక్ష్మీదేవి, ఉదయలక్ష్మి, కళావతి, దానమ్మ, హనుమాలు, మహబీ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న పాలకులు

విశాలాంధ్ర-ఈపూరు : ప్రజా సమస్యలు, కార్మిక, కర్షక సమస్యలు పరిష్కారానికై ఈ నెల 27, 28న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరుగు మహా ధర్నాను కార్మికులు, కర్షకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు ఉట్ల రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు హనుమంతరెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని చిట్టాపురం బొగ్గరం పొనుగోటివారిపాలెం, ముప్పాళ్ళ, అంగలూరు, వనికుంట కొచ్చర్ల కొండముట్ల పలు గ్రామాల్లో మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో గాంధీనగర్ లోని జింఖానా గ్రౌండ్స్‌లో కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేసే విధానాలతో ప్రజల సంపదను వారికి కట్టబెట్టడంలో పోటీలు పడుతున్నాయని, ప్రజలపై అన్ని రకాలుగా భారాలు మోపుతూ పేద ప్రజల నడ్డి విరుస్తున్నాయని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ వారి హక్కులను హరించి వేస్తూ యజమానులకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికులను బానిసలుగా మార్చడమేనన్నారు. లేబర్ కోడులను రద్దుచేసి కార్మిక హక్కులను పునరుద్ధరించాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ విధానాలతో పేదరికం, నిరుద్యోగం, దారిద్రం ఆకలి కేకలు ఎక్కువయ్యాయన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించి రైతులు పండించిన పంటలు గిట్టుబాటు ధరలు కల్పించి రైతుల ఆత్మహత్యలను ఆపాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల అవలంబించే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పే విధంగా విజయవాడలో రెండు రోజులు పాడు జరిగే మహాధర్నాలో కార్మికులు రైతులు కర్షకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలపంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: 'బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కలిసి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను జిల్లా టీడీపీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు శనివారం 20వ వార్డులో ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జి యువ నాయకుడు ఎస్.కె జానీ మాట్లాడుతూ త్వరలో ఉమ్మడి ప్రభుత్వం రాబోతుందని, ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు, పేద ప్రజలకు ఉపయోగపడే అన్నా క్యాంటీన్లు, చంద్రన్న తోఫా, షాది తోఫా, సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, ఎస్సీ ఎస్టీ, బీసీ సబ్సిడీ రుణాలు, ప్రభుత్వ హౌసింగ్ లోన్లు, వాహన మిత్ర, నిరుద్యోగ భృతి, దేశ విదేశాల్లో చదువుకునే బిడ్డలకు అందించే ఫీజు రీ ఇంబర్ మెంట్స్ వంటి అనేకమైన పథకాలు ఈ వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిందని అన్నారు. తిరిగి టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించుకుంటేనే అందరూ సంతోషంగా ఉండగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో 20 వార్డ్ ప్రెసిడెంట్ ముప్పూరి రాములు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ముప్పూరి చౌడమ్మ, వల్లమూడి లచ్చమ్మ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-బొల్లాపల్లి: విజయవాడ నగరంలో ఈనెల 27 28 తేదీల్లో జరిగే రైతు కార్మిక అఖిలపక్ష సంఘాల మహా ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ బొల్లపల్లి మండల కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మహాధర్నా జయప్రదం కోరుతూ శనివారం బొల్లాపల్లి మండలంలోని బొల్లాపల్లి, వెల్లటూరు, అయ్యన్నపాలెం తదితర గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలను ప్రత్యక్షంగా కలుస్తూ మహాధర్నా ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా పిన్ని పోయిన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడటం పట్ల తీవ్రంగా ఖండించారు. అలాగే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాల ఆర్థిక నష్టాలను మిగులుస్తూ అసమర్థ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే. హనుమంత రెడ్డి సిపిఐ నాయకులు సైదావలి, దాశరధి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

విశాలాంధ్ర-గురజాల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జ్ బిఎల్వి శేషాద్రి అధ్యక్షతన ఎక్సైజ్ శాఖ అధికారులకు, పోలీసులకు, న్యాయవాదులకు జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్జి శేషాద్రి మాట్లాడుతూ పది లీటర్ల పరిధి వరకు లిక్కర్, బీర్లు పట్టుబడ్డ కేసులలో వాటి విలువకు మూడు నుండి ఐదు రెట్ల వరకు చెల్లించి సదరు కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవలసినదిగా కక్షి దారులకు సూచించారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు మరియు పోలీసు వారు సదరు కేసులలో ముద్దాయిలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనుటకు గాను వారికి అవగాహన కలుగజేసి కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షర్మిల, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జానీ భాష, ఎక్సైజ్ శాఖ అధికారులు మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పగడాల

విశాలాంధ్ర-నూజెండ్ల: బిజెపి మండల అధ్యక్షుడిగా పగడాల లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కాబడినారు. బిజెపి పలనాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు ఆదేశాల మేరకు జిల్లా జనరల్ సెక్రెటరీ మేడం రమేష్ వినుకొండ నియోజకవర్గ ఇన్చార్జి లెనిన్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పగడాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుజాత, వినుకొండ నియోజకవర్గ కో కన్వీనర్ అప్పారావు, ఈపూరు మండల అధ్యక్షుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు మునుగోటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పెదకూరపాడులో శనివారం హమాలీలు, సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఇవ్వవలసిన ఆర్థిక సహాయము గత 4 సంవత్సరాలుగా నిలిపివేయడం దారుణమని, భవననిర్మాణ కార్మికుల కష్టం దోచుకున్న ఏ ప్రభుత్వము అధికారంలో నిలువలేదన్నారు. రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆశీర్వాదం మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు కూడా ఆర్థిక సహాయం ఇవ్వకపోవటం హేయమైన చర్య అని అన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి టి.ప్రసాదు మాట్లాడుతూ వైఎస్సార్ భీమా తాలూకు ఇవ్వవలసిన ఆర్థిక సహాయం కూడా ఇవ్వక కార్మికుల నోట్లో మన్నుకొట్టారని అన్నారు. అనేక సంవత్సరాలుగా అర్ధాకలితో గడుపుతున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రైతు ఆత్మహత్యలను ఆపాలని, విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజారత్నం, సుధాకర్, చిన్న నాగేశ్వరరావు, యాకోబు, ఏడుకొండలు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నార్రు.

విశాలాంధ్ర-మాచర్ల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 27, 28వ తేదీలలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు కోరారు. శనివారం కొమెరా వీరస్వామి భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకుల తో ఆయన సమీక్ష నిర్వహించారు. బాబురావు మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడంలో చూపే శ్రద్ధ ప్రజా సంక్షేమంపై చూపటం లేదన్నారు. ప్రధాని మోడీ పాలనలో కార్మిక చట్టాలు నిర్వీర్యమై కార్మికులు పూట గడవక రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ప్రైవేటీకరణకు పాల్పడి కార్మికుల శ్రమను దోచుకునేందుకు పాలకులు సిద్ధమయ్యారన్నారు. ఇప్పటికైనా కార్మికులు, ప్రజలు, ప్రజాసంఘాలు ఏకమై మోడీ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేలా అందరూ ఏకతాటిన నడవాలని ఆయన కోరారు. మహా ధర్నాకు పాలకులకు కనువిప్పు కలిగేలా అందరూ భారీగా తరలి రావాలని బాబురావు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఎం. డి భాషా మేస్త్రి, పట్టణ తాపీవర్కర్స్ యూనియన్ నాయకులు గాజుల చెన్నయ్య, పలసా వెంకన్న బాబు, మాచర్ల చిన్న యేసు, షేక్ మౌలాలి, బత్తుల వెంకటస్వామి, పగడాల సుధాకర్, బత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం కోరుతూ కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-రొంపిచర్ల: ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27,28తేదీలలో విజయ వాడలో జరిగే మహాధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలంటూ శనివారం సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రొంపిచర్లలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న కర్షక, కార్మిక, సామాన్య ప్రజా వ్యతిరేక విధానాల కు నిరసనగా రైతు సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, కార్మికులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ మండల నాయకులు తానం మత్తయ్య, నందిగం అంజయ్య, ముప్పూరి మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు.

ఓట్లు తొలగింపునకు కుట్రలు : కొమ్మాలపాటి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అధికారులు, వాలంటర్స్ ద్వారా గ్రామాలలో టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మొదలు పెట్టారని మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బీఎల్‌ఓలతో మాట్లాడిన ఫోన్ కాల్‌ను ఆయన విలేకరులకు వినిపించారు. అమరావతి మండలం, క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో రేవెన్యూ వ్యవస్థను అడ్డుపెట్టుకొని ఓట్ల తొలగింపు కార్యక్రమం మొదలుపెట్టారన్నారు. వైసీపీ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ఓడిపోతామనే భయంతోనే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, ఓట్ల తొలగింపుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

పేదలను దగా చేసిన సీఎం జగన్: జీవీ

విశాలాంధ్ర-శావల్యాపురం : అధికారంలోకి రాక ముందు ప్రజలకు అనేక రకాల హామీలను ఇచ్చి అధికారం చేపట్టాక అనేక కారణాలు చూపి సంక్షేమ పథకాలలో కోత విధించి పేద ప్రజలను జగన్‌మోహన్ రెడ్డి మోసం చేశాడని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. మండలంలోని కారుమంచి గ్రామంలో శనివారం బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఇంటింటికి వెళ్ళి టీడీపీ-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ, మినీ మేనిఫెస్టోలో ఉన్న తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, బీసీలకు రక్షణ చట్టం, నిరుద్యోగ భృతి తదితర పథకాల ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి జీవీ మాట్లాడుతూ టీడీపీ చేసిన అభివృద్ధిని వైసీపీ అంతా మేమే చేశామంటూ బాజాలు మోగిస్తూ సిగ్గు లేకుండా నిజాలను దాచిపెట్టి, ఎన్నికల ముందు మోసం చేసేందుకు బస్సు యాత్రలు, గడప గడపకు బయలుదేరారని విమర్శించారు. ఇసుక, మద్యం, బియ్యం, అమ్ముకొని అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేని ప్రజలు నిలదీయాలని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను దుర్మార్గాలను అవినీతి అక్రమాలను నిలదీసి ప్రశ్నిస్తే హత్యాయత్నాలకు ప్రయత్నించడం, కేసులు నమోదు చేయించడం దుర్మార్గమన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది. పరిపాలన చేయడం చేతకాక తప్పుడు కేసులు పెట్టి బాబుని జైల్లో పెట్టించాడని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు నిర్మించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలోని రహదారులన్నీ గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నందుకా జగన్ మళ్ళీ రావాల్సింది అని ఎద్దేవాచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ఆంధ్ర రాష్ట్రం బాగుపడుతుందని, 2024లో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, మాజీ ఎంపీపీ యరమాసు కోటేశ్వరరావు, ముప్పా గిరి, మల్లవరపు రవి, కోట హరిబాబు, గోపాల శివయ్య, నాగరాజు, పరిమి ప్రసాద్, మల్లవరపు యేసయ్య, యారమాసు రాము, సీనియర్ నాయకులు గోరంట్ల హనుమంతురావు, మాదాల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు అంశాన్ని మ్యానిఫెస్టోల్లో పొందుపరచాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : వృధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ పెంపు అంశాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రితో కలిసి జంగాల మాట్లాడారు. నేటి రాజకీయ పరిస్థితులలో అధికార, ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న వాగ్దానాల వర్షంలో ప్రజలు తడిచి ముద్దవుతున్నారని జంగాల అన్నారు. ఈ నేపథ్యంలో పేద, వృద్ధ, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళల కనీస అవసరాలను గుర్తించి వారికిచ్చే పెన్షన్‌ను పెంచాలని సీపీఐగా ఆయా పార్టీలను కోరుతున్నామన్నారు. మరింత విశాల హృదయంతో ఆయా పార్టీలు ఆలోచించి వారి వారి మ్యానిఫెస్టోలో ఈ పెన్షన్ పెంపు అంశాన్ని చేర్చి అమలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం వృద్ధులకు రూ.2750, దివ్యాంగులకు రూ.3 వేలు, ఒంటరి మహిళలకు, వివిధ వ్యాధులతో బాధపడే వారికి ఇంటికి వచ్చి మారీ పెన్షన్ అందజేస్తున్నారని, దీనికి సీపీఐ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.2750 పెన్షన్‌ను రూ.6 వేలకు, రూ.3 వేల పెన్షన్‌ను రూ.7 వేలకు పెంచి ఆర్థిక ఇబ్బం దుల నుంచి వారు బయటపడేందుకు కావాల్సిన సహకారం అందించా లని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ పెంపు డిమాండ్ సాధన కోసం సీపీఐ డిసెం బర్ మాసంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు దశల వారీ ఆందోళన కార్యక్రమాలను చేపట్టనుందని తెలిపారు. పెన్షన్ అంశాన్ని ప్రాధాన్యత కలిగిన ప్రతిపాదనగా గుర్తించి ఆయా పార్టీలు వారి మ్యానిఫెస్టోలో పొందుపరచాలని, ఎవ్వరూ అధికారంలోకి వచ్చిన ఈ అంశాన్ని అమలు జరపాలని కోరారు. పెన్షన్ పెంపు కోసం సీపీఐ నిర్వహించే ఉద్యమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

శాంతిభద్రతల సమస్య ఉంటే సమాచారమివ్వండి

విశాలాంధ్ర-దుర్గి : గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు ఉన్నట్లైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కారంపూడి సర్కిల్ సీఐ దార్ల జయకుమార్ చెప్పారు. జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ పల్లపురాజు పర్యవేక్షణలో కారంపూడి సర్కిల్ సీఐ జయకుమార్, దుర్గి ఎస్సై మనిపాటి శివ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ధర్మవరం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జయకుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై శివ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం వలన ఆన్‌లైన్‌లో జరుగు మోసాలు, దిశా యాప్ కలిగి ఉండటం వలన కలుగు లాభాలు, గ్రామంలో ఫ్యాక్షన్ కలిగి ఉండుట వలన కలుగు నష్టాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగారపు లక్ష్మీ వెంకటరెడ్డి, ఉప సర్పంచి జానికీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర-దుర్గి : ప్రతి బీఎల్వో వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్ష చేసి పెండింగ్ గల కారణాలను తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని బీఎల్వోలను మండల ఓటర్ల నమోదు అధికారి జి.రమేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన ఓటర్ల జాబితాపై బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు తమ పరిధిలోని ఓటర్లను చైతన్యపరిచి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులను ఓటరుగా నమోదు చేయాలని కోరారు. ఓటర్ల జాబితాలో రెండు చోట్ల ఓట్లు ఉంటే వారికి నోటీసులు యిచ్చి వారి నుంచి సంతకం, ఆధారాలు తీసుకుని ఓటు తొలగించాలన్నారు. మరణించిన వారి ఓట్లను కుటుంబ సభ్యులు నుంచి మరణ ధృవీకరణ పత్రంతోపాటు సంతకం తీసుకుని ఓటు తేసేయాలని సూచించారు. ఒకే ఇంటి నెంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్నట్లైతే వాటిని పరిశీలించి అర్హత ఉంటే బై పన్ ఇచ్చి ఆ ఓట్లను క్రమబద్దీకరించాలని చెప్పారు. పెండింగ్‌లను పరిష్కరించి డిసెంబర్ 9 నాటికి ధరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను పంపేందుకు సైనికుల్లా పనిచేయాలి

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రాన్ని తిరోగమనం వైపుకి నడిపిస్తూ రాష్ట్ర ప్రగతిని సంక్షోభంలో కూరుకుపోయే విధంగా అవినీతి అక్రమాలతో పాలన సాగిస్తూ ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు దొడ్డిదారులు తొక్కుతూ పరిపాలన కొనసాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి పంపించేందుకు ప్రతిఒక్కరూ ఒక సైనికుల్లా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాడు శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తులూరి గ్రామంలో రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా భావితరాల భవిష్యత్తు బాగుండాలన్న బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోని ప్రజలకు వివరిస్తూ ప్రజలతో మమేకమైన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎస్‌కే జాని, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విక్టర్ పాల్‌కు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి నందు డ్రస్సర్‌గా పని చేస్తూ రిటైర్డ్ అయిన శీలం విక్టర్ పాల్ శనివారం అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీ ఎంఈయూ)నాయకులు విక్టర్ పాల్ భౌతిక కాయాన్నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి కూడా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డె బాలయ్య మాట్లాడుతూ చనిపోయిన విక్టర్ పాల్ కుటుంబానికి తమ యూనియన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పి.ఏడుకొండలు, ఐ.వెంకటేశ్వరరావు, కె.విశ్వనాథ్, గోపీ ఉన్నారు.

ఘనంగా యూత్ పార్లమెంట్ ఉత్సవాలు

విశాలాంధ్ర-పొన్నూరు : దేశ రాజధాని అయిన ఢిల్లీ నగరంలోని పార్లమెంట్ గొళ్లమూడిపాడు గల్లీలోకి వచ్చిందా అన్నట్లుగా నేషనల్ యూత్ పార్లమెంట్ ఉత్సవాలు నాట్కో స్కూల్ లెర్నింగ్ పాఠశాలలో అత్యంత ఘనంగా జరిగాయి. వివరాల్లోకి వెళితే, గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, గోళ్లముడిపాడు గ్రామంలోని నాట్కో స్కూల్ ఆఫ్ లెర్నింగ్ పాఠశాలలో నాట్కో ట్రస్ట్ యాజమాన్యం వారి ఆధ్వర్యంలో నాట్కో ట్రస్ట్ సీనియర్ మేనేజర్ డాక్టర్ మదన్ కుమార్, ప్రిన్సిపాల్, పాఠశాల కోఆర్డినేటర్ల పర్యవేక్షణలో నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పార్లమెంటులోని అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యులుగా వారి వారి పాత్రలను సమర్ధవంతంగా పోషించడం జరిగింది. అధికార పార్టీ వారి పనితీరును, పరిపాలనను ప్రతిపక్షం వారు ఘాటైన ప్రశ్నలతో విమర్శించగా, అధికారపక్షం వారు ధీటైన జవాబులతో ప్రతిపక్షం వారిని ఎదుర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ రామినేని శివ రామ ప్రసాద్, సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సౌమ్య, జేఎంజె స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ మ్యారీస్ విచ్చేశారు. నాట్కో ట్రస్ట్ సీనియర్ మేనేజర్ డాక్టర్ మదన్ కుమార్, నాట్కో ఆఫీసర్ రమణారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ షిమ్మి జాయ్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి జయంతి పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : రాజ్యాంగ స్ఫూర్తిని విద్యార్థులు అలవర్చుకోవాలని ఏబీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ టీ.సి రవిచంద్ర కుమార్ అన్నారు. ఏ.బి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ టీ.సి రవిచంద్ర కుమార్ అధ్యక్షత వహించగా లోకల్ అడ్వకేట్ ఏ ప్రభాకరరావు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని అందరు అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా ఉండాలని పేర్కొన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు ఎన్.సుభాషిణి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు రాజ్యంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు.

దీక్షలో పర్చూరు రైతులు

విశాలాంధ్ర-పర్చూరు: గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించుటకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా పెద నందిపాడులో నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహనరావు ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల నిరసన దీక్షలో శనివారం ఆరవ రోజు పర్చూరుకు చెందిన రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరుతూ నినాదాలు చేశారు. దీక్షలో కోటా హరిప్రసాద్, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహరావు, కొల్లా శివరామప్రసాద్ ఉన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం...

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు, నాగులపాలెంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. పిల్లలను, వృద్ధులను, యువకులు 25 మందిని కరచింది. బాధితులు వరుసగా ప్రభుత్వ వైద్యశాల బాటపట్టారు. పంచాయతీ సిబ్బంది, యువకులు కుక్కను బంధించటానికి విశ్వప్రయత్నం చేశారు. అయితే తప్పించుకొని తిరుగుతుంది. పిచ్చికుక్క బారిన పడకుండ జాగ్రతగా ఉండాలని పంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. పట్టణంలో మసీదు సెంటరు, ఊటుకూరివారి వీధిల వద్ద జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎన్.ఆర్.అండ్.పీ.ఎం హైస్కూల్ ఆవరణలో మహిళా జిమ్ భవనం, పార్క్, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో క్లోరిన్ రూమ్ నిర్మాణపు పనులు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీ.ఈ యేసయ్య, ఏ.ఈ కట్టా రవికుమార్,శానిటరీ ఇన్స్పెక్టర్ కొండయ్య, కౌన్సిలర్లు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో లబ్ధి అందుతుందని వైకాపా నాయకులు అన్నారు. మండలంలోని బుర్లవారిపాలెం సచివాలయం పరిధిలో హరిజనవాడ గ్రామంలో శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్‌ల ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వై.ఎస్ రాజశేఖర రెడ్డి, డాక్టర్.బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాల రెడ్డి,బుర్ల సాంబశివరావు, బోయిన కేశవులు, నల్లబోతుల రాజ్ కుమార్, బుర్ల మురళి కృష్ణ, ధనుంజయ, పర్వతనేని శ్రీనివాసరావు, గవిని నారాయణ,పిట్టు పోలయ్య, దివి జయరాం,తేళ్ల రాంబాబు, గ్రామ పెద్దలు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన

విశాలాంధ్ర - పర్చూరు : గేరాడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్చూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు జరిగాయి. నేటి ఆధునిక భారతదేశంలో భారత రాజ్యాంగాన్ని ఉన్నది ఉన్నట్లుగా అమలు చేయాలని, అలా అమలు చేయాలంటే భావి భారత పౌరులైన విద్యార్థులే రాజ్యాంగంపైన అవగాహన పెంచుకోవాలని, అందు నిమిత్తమే గేరాడ్స్ ఫౌండేషన్ ఈ రాజ్యాంగ పీఠికను చదివే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఫౌండేషన్ ఛైర్మన్ అల్లడి కనకరత్నం,ప్రధాన ట్రస్టీ గేరా స్వరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ గేరా అశోక్ బాబు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గేరా అజేష్ కుమార్,ట్రస్టీలు తాని కొండ జయానంద్, గోళ్ళమూడి రాజేష్, అల్లడి సంతోషం, ప్రధానోపాధ్యాయులు కొండ్రు ప్రసాద్, ఉపాధ్యాయులు బి.సురేష్ పాల్గొన్నారు.

పడిపూజలో కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని పెర్లవారిపాలెం గ్రామంలో శ్రీ అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవంలో నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్షధారులు ఆయనకు అభినందనలు తెలిపారు. మంటపం వద్ద కొండయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా అరాచక పాలనతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని టీడిపిని అత్యధిక మెజారిటీతో విజయం సాధించి సుపరిపాలన అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తు కోసం తెదేపాను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొగడదండ రవి,గంజి పురుషోత్తం, కౌతరపు జనార్దనరావు,బోయిన శ్రీనివాసరావు,గుమ్మడి ఆనంద్,తెదేపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర-తాడేపల్లి : రానున్న రోజులలో జనసేన, టీడీపీ కలిసి సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు అన్నారు. శనివారం సాయంత్రం కొలనకొండ జనసేన పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి చేసింది ఏమీ లేదని విమర్శించారు. జనసేన నాయకులు తిరుమలశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాధర్నా జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి బత్తుల శ్యాముల్

విశాలాంధ్ర - రేపల్లె : కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27,28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరుగు కార్మిక మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భత్తుల శ్యాముల్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని గొడౌన్స్ వద్ద ఏపీ సివిల్ సప్లయ్స్ హమాలి కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హమాలి కార్మికులకు దసరా కానుకను ఇంతవరకు విడుదల చేయకపోవటం సిగ్గుచేటన్నారు. దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘ టిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యమాల ద్వారా కార్మి కులు సాధించుకున్న హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం విచారకరమ న్నారు. సివిల్ సప్లయ్స్ హమాలి కార్మికులను కాదని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులతో గిడ్డంగులలో పనికి నియమించటంతో అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పో యారని తెలిపారు. సివిల్ సప్లయ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులకు సరైన రక్షణ కల్పించకుండా వారి హక్కులను సైతం నిర్వీర్యం చేసే చర్యలకు నిరసనగా ఈ నెల 27,28 తేదీలలో విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాలో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, కర్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బెజ్జం ముఖర్జీ, మెస్త్రీలు కర్ర రవిబాబు, తాత ఉమా మహేశ్వరరావు, వేమూరు విజయారావు, పి.పైడయ్యా , కార్మికులు పాల్గొన్నారు.

కొడుకు గొప్ప వాడైతేనే తండ్రికి సంతోషం..

విశాలాంధ్ర - యద్దనపూడి : కొడుకు పుట్టగానే తండ్రికి సంతోషం కలగదు, ఆ కొడుకు గొప్పవాడైనప్పుడే ఆ తండ్రికి నిజమైన సంతోషం, కానీ ఆ కొడుకు గొప్పవాడై, ప్రజలు అతనిని పొడుగుతున్న ప్పుడు ఆ తండ్రికి నిజమైన సంతోషం కలుగును అని సుమతీ శతకంలోని ఒక పద్య భావం. సరిగ్గా ఈ భావం యద్దనపూడి మండలంలోని అతి చిన్న పల్లెటూరు చిలుకూరివారిపాలెం గ్రామవాసి, ఆర్.టీ.సి డ్రైవరుగా పనిచేసి అందరి మన్ననలు పొంది,పదవీ విరమణ చేసిన రావిపూడి బ్రహ్మయ్యకు సరిపోతుంది. విజయవంతమైన సినిమాల దర్శకుడిగా పేరు పొందిన యువ దర్శకుడు అనిల్ రావిపూడి ఈ బ్రహ్మయ్య కుమారుడు ఇంజనీరింగ్ చదివిన కుమారుడు సినిమా రంగంపై ఆసక్తి చూపటంతో,సినిమా రంగంలో రాణించటం ఎంత కష్టమో తెలిసిన బ్రహ్మయ్య, కొంత ఇష్టం కొంత అయిష్టంగానే కుమారుని ప్రతిపాదనకు సరే అన్నాడు.అంచలంచలాగా ఎదుగుతూ తన కుమారుడు అనిల్ రావిపూడి స్వయంకృషితో ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ అగ్రహీరోలతో సినిమాలు చేసి విజయవంతమైన సినిమాలతో యువ దర్శకుడిగా మంచి పేరు సంపాదించాడు. ఆ తండ్రి ఆనందానికి అవధులు లేవు. ఇటీవల నటరత్న బాలకృష్ణతో అనిల్ తీసిన సినిమా భగవంత్ కేసరి విజయవంతం కావడం కొడుకు దర్శకత్వంలో తండ్రి నటించటం, ఆ సినిమా సక్సెస్ మీట్‌లో తనయుడి తరపున షీల్డ్ అందుకున్న బ్రహ్మయ్య ఆనందం వ్యక్తం చేశాడు. ఆర్.టీ.సి డ్రైవరుగా పనిచేసిన బ్రహ్మయ్య ఈ సినిమాలో ఒక సన్నివేశంలో బస్సును నడపడం విశేషం. కుమారుడు దర్శకత్వంలో తండ్రి నటించటం ఆ తల్లిదండ్రులు పూర్వజన్మ సుకృతమని ప్రజల ఆకాంక్ష

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్య పెంచాలని ఓపెన్ స్కూల్ రాష్ట్ర సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల విద్యార్థులు చదువును మధ్యలో మానేసిన వారికి అలాగే టెన్త్,ఇంటర్ ఫెయిల్ అయిన వారి కోసం ప్రభుత్వం దూర విద్యా విధానం ద్వారా టెన్త్, ఇంటర్‌లలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తుందన్నారు. అడ్మిషన్లు పొందాలనుకునే వారికి ఈ నెల 30వరకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం పాలపర్తి శివన్నారాయణ, పిడి జీ.కుటుంబరావు, పాఠశాల ఉపాధ్యాయులు, డ్వాక్రా మహిళలు, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మైనార్టీలంతా కాంగ్రెస్ కోసం పనిచేస్తాం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కాంగ్రెస్ పార్టీ కోసం మైనార్టీలంతా కలిసి ఐక్యతగా పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ అధ్యక్షులు పఠాన్ రాజేష్ తెలిపారు. పార్లమెంట్ అధ్యక్షులు జేడీ శీలం ఆదేశాల మేరకు,జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు నేతృత్వంలో పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం నియోజకవర్గ మైనార్టీ కమిటీని ఎన్నుకున్నారు.ఈ కమిటీలో పట్టణ మైనార్టీ అధ్యక్షులుగా అమాన్ ఉల్లా బేగ్, నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్‌గా నజీర్ హుస్సేన్, నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షులు అమీర్ బేగ్‌ను ఎన్నిక చేసామన్నారు. ముస్లిం మైనారిటీ సోదరులంతా కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.కేంద్రంలో మతతత్వం అనేదే లేకుండా ఈ మోడీని గౌరవంగా ఇంటికి పంపించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని పేర్కొన్నారు.పార్టీ కోసం పార్టీ బలోపేతం కోసం పాటుబడతామని నూతన మైనార్టీ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మీరావల్లి, బాషీర్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన రూరల్ అధ్యక్షుడిగా దాసరి ఏసుబాబు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జనసేనపార్టీ రూరల్ అధ్యక్షులుగా దాసరి ఏసుబాబుని నియమించామని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 మంది సభ్యులతో బాపట్ల రూరల్ మండలానికి నూతన జనసేనపార్టీ కార్యవర్గాన్ని నియమించమన్నారు. కొండురి శ్రీను,వల్లు శ్రీనివాసరావులను ఉపాధ్యక్షులుగా,నంగనం సుబ్బరాజు,బండారు ఉమామహేశ్వరరావు, జొన్నలగడ్డ మహేష్,జనరల్ సెక్రెటరీలుగా,దాసరి నాగేశ్వరరావు,వయల కిషోర్,పులిపాటి వినయ్,కుమారి ప్రేమ్‌లను సెక్రెటరీ లుగా నియమించటం జరిగిందన్నారు.అంతరం నూతన కమిటీ సభ్యులుగ ఎన్నికాబడిన వారికి జనసేనపార్టీ నాయకులు నామన శివన్నారయణ, గుంటుపల్లి తులసీ కుమారి కార్యాలయంలో నియామక పత్రాలు అందచేసినారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కారుమూరి ఆంజనిష్ ,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నవంబర్ 26 తేదీన భారత రాజ్యాంగ ఆమోదదినోత్సవం సభను జయప్రదం చేయాలని బాపట్ల,ప్రకాశం జిల్లాల కో-ఆర్డినేటర్ జంగం రాజశేఖర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి బద్ధులై,రాజ్యాంగ విలువల పరిరక్షణకు పాటుపడాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, రాజ్యాంగంపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఆదివారం 9 గంటలకు ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డులోని ఎన్జీవో హోం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,రమాబాయి విగ్రహాల వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోదదినోత్సవం సభను విజయవంతం చేయాలని కార్యకర్తలు,అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కొచ్చర్ల వినయ్‌రాజు, బురదగుంట రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : డిసెంబర్ 3వ తేదీ లోపు దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని భావపురి దివ్యాంగుల సేవా సమితి గుంటూరు జిల్లా అధ్యక్షులు గోగన ఆదిశేషు అన్నారు. అంబేద్కర్ భవన్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా జోజిబాబు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులందరూ ఐకమత్యంగా ఉండి హక్కులను కాపాడుకోవాలన్నారు. పదివేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన శివన్నారాయణ మాట్లాడుతూ దివ్యాంగులకు 300 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు.తెదేపా నియోజకవర్గం ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా దివ్యాంగులు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తానమన్నారు.మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కార్యక్రమానికి హాజరైన వారికి భోజనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల దివ్యాంగుల అధ్యక్షుడు కంది వెంకటరెడ్డి, చీరాల నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షుడు గురవయ్య,పర్చూరు నియోజకవర్గం దివ్యాం గుల అధ్యక్షుడు అశోక్, బాపట్ల పట్టణ దివ్యాంగుల అధ్యక్షులు పాత్ర బాలసుందర్ తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని దేశాయిపేట రైతు భరోసా కేంద్రం- 4లో శనివారం ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలోని 13 మండలాల క్యాడర్‌కు అవగాహన సదస్సు జరిగింది.జిల్లా డి.పి.యం.వీరగాని,వాణిశ్రీ క్యాడర్‌కి దిశా నిర్దేశం చేశారు.ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం జరుగుతున్న ఆర్.బి.కెలకు అనుసంధానంగా కొత్త ఆర్.బి.కెలను తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వేటపాలెం మండల ఏ.ఓ కాశీ విశ్వనాధ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పంటలపై అవగాహన కలిగించాలని తెలిపారు.ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన ఇన్పుట్‌లు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా డి.పి.ఎం.యు సిబ్బంది, ఎం.టి.లు, 13 మండలాల క్యాడర్, వి.ఏ.ఏ సెరెనా రాజ్‌లు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన: కోన

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ప్రజల గుండెల్లో నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని భవనంవారిపాలెం పంచాయితీలో రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి మరల ముఖ్యమంత్రి ఎందుకు కావాలి., పల్లె నిద్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చోడిపాలెం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వైసీపీ పార్టీ జండా ను ఆవిష్కరించారు. పాతరెడ్డిపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి చిన్నారి విద్యార్థులు తో మాటమంతి నిర్వహించారు. కోనా రఘుపతి మాట్లాడుతూ గాంధీ కలలు కన్న స్వరాజ్యానికి 2019లో అడుగు పడింది అన్నారు.దీనికి నిదర్శనంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తొలి మెట్టు అన్నారు. పల్లెలు దేశానికి పట్టు కొమ్మలు అన్న విధంగా నేడు గ్రామాలు అబివృద్ధి చందాయి అన్నారు. పరిపాలన ప్రతి ఒక్కరి ముంగిట్లోకి తెచ్చిన ఘనత తమ పార్టీ కే దక్కుతుంది అన్నారు.సచివాలయ నిర్మాణం వలనపరిపాలన సౌలభ్యం జరిగి అబివృద్ధి క్షేత్ర స్థాయి నుండి అవటానికి సాకారం ఉంటుంది అన్నారు.అంబేత్కర్ చెప్పినట్లు సమ సమాజ స్థాపన,అందరిని గౌరవాన్ని ఇవ్వాలి అనే విధంగా తమ పార్టీ సిద్ధాంతాలు ఉన్నాయి అన్నారు.కొత్తరెడ్డిపాలెం స్మశానంకు రహదారి కోసం ఎన్నో తరాలుగా ఎదురుచూస్తున్న సాధ్యం కాలేదన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయంలో రహదారి నిర్మాణం చేశాన్నారు. అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయటమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ప్రజలు కల్ల బొల్లి మాటలు విని ప్రజా సంక్షేమం ఇష్టం లేని చంద్రబాబుకు రానున్న రోజుల్లో బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలి అంటే ఇక్కడ కోనా రఘుపతిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బాజీ, ఉపాధ్యక్షుడు కృపానందం, ఎంపీటీసీ సింధు, విజయ రాజు, సర్పంచ్ లు మాధవరావు, నాయకులు కోటి రెడ్డి,శివరెడ్డి, బడుగు ప్రకాష్,సుబ్బారావు, హుస్సేన్,ప్రసన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా నిను చూస్తామయ్యా..

విశాలాంధ్ర - బాపట్ల : అధికారం లేకుండానే చాలా సాయం చేశావయ్యా.. ఈ సారి ఎమ్మెల్యేగా నిన్ను చూస్తామయ్యా అంటూ రైలుపేటకు చెందిన మణిమ్మ వేగేశనతో మన స్ఫూర్తిగా చెప్పిన మాట ప్రజల్లో వేగశనపై ఉన్న భావం జోష్ నింపుతుంది. ఇంటింటికి తెలుగుదేశం మీ మాటే - నా బాట,భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం పట్టణంలోని 6వ వార్డ్‌లో శనివారం జరిగింది. మహిళలకు చీర ఇస్తూ భవిష్యత్తు గ్యారెంటీ సంక్షేమ పథకాలు వివరిస్తూ పర్యటన చేశారు. ఈసందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందన్నారు.రాబోయే ఎన్నికలలో ప్రజా ఆగ్రహానికి వైసీపీ ప్రభుత్వం కులాటం ఖాయమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఒక్కోక్క ఏడాదికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500 ఇస్తామన్నారు.దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్‌లు ఉచితంగా అందజేస్తామన్నారు.చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఫరిద్ మస్తాన్, మస్తాన్‌వలి,షేక్ అసిఫ్,ఇలాహి,పల్లం జీవన్, అసిఫ్, మొహమ్మద్ ఖాన్, తాత చిన్న బాబు, శ్రీను, కోటి, పల్లం సరోజినీ, శ్రీదేవి, రాణి, రజిని, మహాలక్ష్మి, రుక్మిణి, రామదేవి,రమాదేవి, ఇందు,మరియమ్మ,షేక్ మస్తాన్‌బి, నవనియతం, నాజ్మా, కిరణ్, వెంకట్, శేఖర్, కోటేశ్వరరావు,కొల్లూరు వెంకట్రావు, హనుమాన్ జి, సూరగని మురళి, మహేష్, నాగుల్ షరీఫ్, శ్రీకాంత్ నాగ్గురి ముజిబ్ తదితరులున్నారు.

రాజ్యాంగ ప్రస్తావన కరపత్రాలు రూపొందించడం సంతోషం

విశాలాంధ్ర -బాపట్ల : నవంబర్ 26 రాజ్యాంగం ఆమోదింపబడిన రోజు సందర్భంగా భారత రాజ్యాంగం ప్రస్తావన కరపత్రాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాన్యులకు చేరువైన భావాన్ని తెలుసుకునే విధంగా రాజ్యాంగ ప్రస్తావనను కరపత్రాలు రూపంలో రూపొందించడం సంతోషకరమని రాజ్యాంగంలో పొందుపరిచిన లక్ష్యాలు ఈ కరపత్రాల్లోని అంశాలను అందరూ చదువుకుని అనుసరించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అయిన రాజ్ దిబోరా ,జిల్లా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాసరావు గుదే రాజారావు పొందుగల ప్రసాదరావు పాల్గొన్నారు.

వెంకటేష్‌కు జిలానీ పరామర్శ

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో కరణం వెంకటేష్‌ను త్వరగా కోలుకోని మరలా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని అన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్‌ను శనివారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ పరామర్శించారు.ఈ సందర్భంగా వెంకటేష్ బాబు మాట్లాడుతూ డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నానని,అతిత్వరలోనే కోలుకుని తిరిగి నియోజకవర్గానికి వస్తానన్నారు.

రామ్‌నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్

విశాలాంధ్ర - చీరాల : గంజాయి,నాటుసారా కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాని గంజాయి,నాటు సారా క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే పీడీ చట్టం ప్రయోగించడానికి కూడా వెనకాడబోమని చీరాల టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రామ్ నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించడం నిర్వహించారు. సరైన పత్రాలు లేని అనుమానిత 8 ద్విచక్ర వాహనాలు,4 ఆటోలను సీజ్ చేశామని,నాటు సారా తయారీకి పులియబెట్టిన 150 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి,4 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్పి టి.విద్యాశ్రీ,ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ పి.శేషగిరిరావు,సెబ్ ఇన్స్పెక్టర్ సోమయ్య,ముగ్గురు ఎస్ఐలు,70 మంది సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

చట్టవ్యతిరేక చర్యలపై సమాచారమివ్వండి : డీఎస్పీ

విశాలాంధ్ర - రేపల్లె : చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడే లక్ష్యంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, సెబ్ అధికారులు సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు సరైన పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పోలీస్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేతాజీ నగర్‌లో నివాసం వుంటున్న కొత్త వ్యక్తులను విచారించి వారి వివరాలను సేకరించామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త వ్యక్తుల గురించిన,అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ గానీ, డైల్ 100,112లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ నజీర్ బేగ్,డివిజన్ పరిధిలోని ఎస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ, క్షమించే గుణాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర - చీరాల : ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయం చేస్తూ ప్రేమ, క్షమించే గుణాలు కలిగి క్రీస్తు మార్గంలో నడవాలని వైస్సార్సీపీ చీరాల పట్టణ అధ్యక్షుడు-1 కొండ్రు బాబ్జి,డాక్టర్ తాడివలస దేవరాజులు అన్నారు.చీరాల దండుబాటు రోడ్డులోని చీరాల టౌన్,రూరల్ పాస్టర్స్ ఇవాంజలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రత్నరాజు బెతెస్త ప్రేయర్ హల్ ఆవర ణలో పాస్టర్ అలెక్స్ అధ్యక్షతన సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ టౌన్1 అధ్యక్షుడు కొండ్రు బాబ్జీ,శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎం.డి డాక్టర్ తాడివలస దేవరాజులు మాట్లాడుతూ బడుగు బల హీన వర్గాలకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదలకు, దైవసేవ కులకు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ కూడా ఎల్లవేళల అతి తక్కువ ఖర్చుతో వైద్య సహాయాన్ని అందిస్తుందన్నారు. అనంతరం దేవరాజు,కొండ్రు బాబ్జి, మార్పు బాబు,లూథర్ శాస్త్రి దైవసేవకులకు నూతన వస్త్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ,గ్రామీణ పాస్టర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రత్నరాజు, డానియల్,యేసుదాసు,వసంతరావు,సోలమన్ రాజు,చిట్టి బాబు, రవి,ఇసాక్,వెంకట్రావు,ప్రభుదాసు, జోషఫ్,రాజు,రామరావు వైసీపీ నాయకులు మార్పు బాబు,పులిపాటి భూషణం, తలకాయల సుధీర్,తేళ్ల రాంబాబు, కప్పల సాయి, గొల్లపల్లి అనిల్,రత్న బాబూ, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్ రెడ్డి

విశాలాంధ్ర - రేపల్లె : దళితులు మేనమామలు అని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి దళిత విద్రోహ చర్యలకు పాల్పడ్డారని టీడీపీ జిల్లా కార్యదర్శి కూచిపూడి మోహన్ రావు విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 27 దళిత పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. దళిత కాలనీల అభివృద్ధికి కేటాయించిన రూ.33 వేల కోట్ల ఎస్సీ,ఎస్టీ రాజ్యాంగబద్ధ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని చెప్పారు. అంబేద్కర్ విదేశీ విద్యను రద్దు చేసి పేదలకు ఉన్నత విదేశీ విద్యను దూరం చేశారని తెలిపారు. నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఎస్సీలకు రుణాలను కుదించి నామమాత్రం చేశారని,భూమి కొనుగోలు పథకం రద్దు చేశారని ఆరోపించారు.ఎంతో మందికి ప్రయోజనం కల్పించిన ఇన్నోవాకార్లు, తదితర వాహనాల పథకం రద్దు చేసిన దళిత ద్రోహి జగన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు.నాలుగు ఎస్సీ నియోజకవర్గాల మధ్యనున్న అమరావతిలో దళిత రాజధానిని నీరుగార్చారని విమర్శించారు. దళితులపై దాడులు హత్యలు అత్యాచారాలు చేశారని మండిపడ్డారు.సుబ్రమణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేసినా దళిత మంత్రులు మాట్లాడక పోవటం సిగ్గు చేటన్నారు. ఇలా ఎందరో దళితులను దారుణంగా ఈ ప్రభుత్వం హత్య చేసిం దని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి దళితులు బుద్ధి చెప్పాలన్నారు. టిడిపి దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దేశానికి కాంగ్రెస్ పార్టీ అవసరం

విశాలాంధ్ర - చీరాల : దేశానికి కాంగ్రెస్ పార్టీ అవసరం చాలా ఉందని అందరం కలిసి కట్టుగా కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దామని చీరాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దేవరపల్లి రంగారావు అన్నారు.శనివారం వేటపాలెం మండల అధ్యక్షునిగా యెనుమల సూర్య ప్రదీపను నియమిస్తూ దేవరపల్లి రంగారావు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవరపల్లి రంగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు,మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆదేశాల మేరకు ఈ నియామకం అధికార పూర్వకంగా ఇచ్చామని దేశం కోసం ప్రాణాలు అర్పించిన నాయకులు కాంగ్రెస్ పార్టీ వారన్నారు.చరిత్ర కలిగిన పార్టీకి మండలాధ్యక్షునిగా సేవలు అందించి పార్టీని బలోపేతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కె.సురేష్,బండ్లమూడి విజయ్ కుమార్, పీటర్ రమేష్,మెరుగ సురేష్ బాబు,షేక్ మస్తాన్,షేక్ బాషా,రహమ్మత్ అలీ,కోటయ్య,పెర్లి బుజ్జిరాజు,యెనుమల సూర్య ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర - చీరాల : ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వైస్సార్సీపీ రాష్ట్ర ఎస్సి సెల్ సంయుక్త కార్యదర్శి పెర్లి నాని ఒకటవ పట్టణ సీఐ శేషగిరిరావుని పెర్లి నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కోరారు.ఈ కార్యక్రమంలో పెర్లినాని మాట్లాడుతూ చీరాలలో ఉన్న పలు సమస్యలపై దృష్టి సారించి ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రజలకు అందించాలన్నారు.

నేడు వలపర్లలో కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర -మార్టూరు : వలపర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం ఏలూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని మండలం అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు కోరారు.ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్,నోవా అగ్రి గ్రూప్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉదయం 8గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. కంటి వైద్య శిబిరంలో బిపి,షుగర్, రక్త పరీక్షలు అనంతరం కంటి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.అవసరమైన వారికి శంకర్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందిస్తారన్నారు.ప్రజలు,నాయకులు,కార్యకర్తలు,పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.